జమ్మూ కశ్మీర్ ఎన్నికల్లో ప్రజలు పెద్దఎత్తున తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. కశ్మీర్ లోయలో ప్రజాస్వామిక ప్రక్రియకు బలం చేకూరడం సహజంగానే మతోన్మాద, తీవ్రవాద శక్తులకు కంటగింపుగా మారింది. భారత భద్రతా బలగాలపై హింసాయుత దాడులు జరిపాయి. ఈ తీవ్రవాదులు సరిహద్దు బయటి నుంచే వచ్చారనడానికి సాక్ష్యాధారాలు లభించాయి.

# తూటాకు వెరవని కశ్మీర్!

## జనరల్ స్టడీస్



ఎన్నికలు సజావుగా జరిగితే కశ్మీర్‌కు సంబంధించిన అనేక విషయాలు ప్రపంచానికి వెల్లడవుతాయి. దీన్ని నివారించడానికే పాక్ ప్రేరేపిత తీవ్రవాదులు కశ్మీర్‌లో దాడులకు పాల్పడ్డారు. భారతదేశంలో అంతర్భాగమైన కశ్మీర్ విషయంలో తన వైఖరి ఏమిటనేది మనదేశం ద్వైపాక్షిక, అంతర్జాతీయ వేదికలపై అనేకసార్లు స్పష్టం చేస్తూనే వచ్చింది. అయినా పాక్ తీరు మారలేదు. అంతర్జాతీయ వేదికలపై కశ్మీర్‌ను వివాదాస్పద అంశంగా ప్రస్తావిస్తోంది.

> **భారత్ దృష్టిలో కశ్మీర్ పూర్తిగా ద్వైపాక్షిక వివాదం. ఈ సమస్య పరిష్కారానికి పాకిస్థాన్‌తో చర్చలకు భారత్ ఎప్పుడూ సిద్ధమే. దీర్ఘకాలిక సమగ్ర చర్చలు జరగాలని కూడా భారత్ ప్రకటించింది. అయితే, పాకిస్థాన్ అనుసరించే కవ్వింపు చర్యలతో ఉభయదేశాల మధ్య చర్చల ప్రక్రియలో ప్రతిష్టంభన ఏర్పడుతోంది.**

★ కశ్మీర్‌లో అశాంతి ఉందని, అక్కడి ప్రజలపై భారతదేశ నిర్బంధం సాగుతోందని పాకిస్థాన్, దాని మద్దతుతో చెలరేగుతున్న తీవ్రవాద సంస్థలు ప్రచారం సాగిస్తున్నాయి. ఎన్నికలు శాంతియుతంగా పూర్తయి, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొంటే పాకిస్థాన్ ప్రచారంలోని కుతంత్రాన్ని ప్రపంచం అర్థం చేసుకుంటుంది. ఈ భయంతోనే పాక్ ప్రేరేపిత తీవ్రవాదులు ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చారు. కానీ కశ్మీర్ ప్రజలు దీన్ని తిరస్కరించారు.

★ కశ్మీర్ సమస్యను భారత్, పాకిస్థాన్ పరిష్కరించుకోవాలని చెబుతూనే ఇరు దేశాలు కోరితే మధ్యవర్తిత్వానికి తాను సిద్ధమేనంటూ ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇది భారత్ వైఖరికి పూర్తిగా విరుద్ధం. పాక్ వైఖరిని ముఖ్యంగా ఈ అంశంపై అమెరికా వైఖరిని సమర్థించే రీతిలో ఐరాస సెక్రటరీ జనరల్ వ్యాఖ్యానించడం గమనార్హం.

★ కశ్మీర్ వివాదంలో మూడో వ్యక్తి లేదా అంతర్జాతీయ జోక్యానికి భారత్ పూర్తిగా వ్యతిరేకం. భారత్‌లో పర్యటించిన అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. నాటి భారత ప్రధాని మన్మోహన్ సింగ్‌తోపాటు విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఒబామా ఇరు దేశాలు కోరితే కశ్మీర్‌పై సహకరించడానికి అమెరికా సిద్ధమేనంటూ వ్యాఖ్యానించారు.



ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

### సానుకూలంగా ప్రజలు..

★ తీవ్రవాదుల హెచ్చరికలను కూడా లెక్క చేయకుండా కశ్మీర్ ప్రజలు ఎన్నికల్లో పాల్గొనడాన్ని సానుకూల అంశంగా భారత ప్రభుత్వం స్వీకరించాలి. విద్య, ఆరోగ్యం, ప్రజాపంపిణీ వ్యవస్థ మొదలైన అనేక తక్షణ అవసరాలు తీరేందుకు ప్రజా ప్రతినిధులు, ఎన్నికైన ప్రజా ప్రభుత్వం అవసరమని కశ్మీరీలు భావించారు.

★ కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తమ రాజకీయ అవసరాల కోసం కశ్మీర్ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను పావుగా వాడుకున్నాయి. పర్యవసానంగా కశ్మీర్‌లో జాతీయ పార్టీలు బలహీనపడ్డాయి. తమ అస్తిత్వంపై కేంద్రం పెత్తనం సాగిస్తోందన్న భావన కశ్మీర్ ప్రజల్లో నెలకొంది. ఈ అసంతృప్తిని మతోన్మాదులు, వేర్పాటువాదులు, సీమాంతర ఉగ్రవాదులు తమకు అనుకూలంగా మలచుకున్నారు.

> **కశ్మీర్ విషయంలో అనుసరించాల్సిన విధానాన్ని రూపొందించుకునేముందు కేంద్రం గత అనుభవాలను దృష్టిలో ఉంచుకోవాలి. కశ్మీర్ ప్రజల భావాలకు ప్రాతినిధ్యం వహించే వ్యక్తులు, సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి.**

### ప్రత్యేక ప్రతిపత్తి...

★ కశ్మీర్ ఒక ప్రత్యేకమైన చారిత్రక సందర్భంలో భారత్‌లో విలీనమైంది. నాడు అంతర్జాతీయంగా, ఐక్యరాజ్య సమితిలో కూడా భారత్‌కు ప్రతికూల వాతావరణమే ఎదురైంది. పాకిస్థాన్ ప్రేరేపిత సాయుధ మూకలు దురాక్రమణకు ప్రయత్నించాయి. కశ్మీర్ రాజు స్వతంత్ర ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కశ్మీర్ ప్రజలు షేక్ అబ్దుల్లా నాయకత్వంలో రాచరికానికి, పాకిస్థాన్ దుశ్చర్యలకు వ్యతిరేకంగా పోరాడారు. భారత ప్రభుత్వ సాయంతో ఈ ద్విముఖ పోరులో విజయం సాధించారు. అలా భారత్‌లో భాగమయ్యారు.

★ ఈ ప్రత్యేక పరిస్థితులను గుర్తించే భారత రాజ్యాంగం 370 వ అధికరణం ద్వారా కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించింది. కానీ కాలక్రమేణా ఆర్టికల్ 370 ఉద్దేశం నీరుగారిపోయింది. కశ్మీర్ ప్రజల్లో అసంతృప్తి భావన పెరగడానికి ఇదే కారణమైంది. సరిగ్గా ఈ పరిస్థితులను మతోన్మాద, తీవ్రవాద శక్తులు తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నాయి. కశ్మీర్‌ను రావణకాష్టంగా మార్చాయి. అందుకే బలప్రయోగం ద్వారా మాత్రమే కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడం సాధ్యం కాదు. కశ్మీర్ అంశంపై కేంద్రం సమగ్రమైన విధానాన్ని రూపొందించాలి. ఈ సమస్యతో సంబంధం ఉన్న అందరికీ చర్చల్లో పాల్గొనే అవకాశం ఇవ్వాలి.

### తీవ్రవాదంపై కఠిన వైఖరి..

★ భారతదేశ సార్వభౌమాధికారానికి లోబడి, సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా కశ్మీర్ స్వయం ప్రతిపత్తి డిమాండ్‌కు పరిష్కారాన్ని అన్వేషించాలి. సరిహద్దు వద్ద భారత భద్రతా బలగాలపై జరిగే తీవ్రవాద దాడులను మిలటరీ పద్ధతిలోనే ఎదుర్కోవాలి. అయితే, తీవ్రవాదుల ప్రభావంలో ఉన్నంత మాత్రాన కశ్మీర్ ప్రజలు తీవ్రవాదులు కారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

★ దేశ సార్వభౌమాధికారాన్ని ధిక్కరించే తీవ్రవాదుల పట్ల కఠినంగా వ్యవహరించాలి. వారికి బలాన్ని చేకూరుస్తున్న అంశాలను గమనించి, నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలి. భారత సార్వభౌమాధికారం, సమగ్రత పట్ల కశ్మీర్ ప్రజల్లో విశ్వాసం పెరిగేలా చేయాలి.

★ భారత్ - పాక్ సంబంధాలకు, కశ్మీర్ సమస్యకు సన్నిహిత సంబంధం ఉంది. కశ్మీర్‌లో అశాంతి, ఉద్రిక్తతలను సృష్టించడం ద్వారా ఇరుదేశాల సంబంధాలను దెబ్బతీయాలనేది తీవ్రవాదుల పన్నాగం.

★ వాస్తవాధీన రేఖ వద్ద కాల్పుల విరమణ ఉల్లంఘన, స్తంభించిన చర్చల ప్రక్రియ భారత్ - పాక్ సంబంధాలను దెబ్బతీస్తున్నాయి. రెండు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత సమస్యను మరింత జటిలం చేస్తోంది. అందుకే భారత్ పాకిస్థాన్‌తో సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

★ పాకిస్థాన్ వైఖరి తెలిసి కూడా ఆ దేశంతో సంబంధాలను మెరుగుపరుచుకోవడంలో భారత్ ప్రయోజనకరమైన వ్యూహాన్ని అనుసరించాలి. అలాగే ఆర్థిక, వాణిజ్య సంబంధాలను పెంపొందించేలా సమగ్ర చర్చల ప్రక్రియను ప్రారంభించాలి. ఇరు దేశాల సంబంధాలపై తీవ్రవాద దాడులు ప్రతికూల ప్రభావం చూపకుండా జాగ్రత్త పడాలి.

(రచయిత ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం అధ్యాపకులు, శాసనమండలి సభ్యులు)

### పరిష్కారం ఇలా...

కశ్మీర్‌లో ఏర్పడే పౌర ప్రభుత్వానికి కేంద్రం అన్ని విధాలా సహకారాన్ని అందించాలి. ఎన్నికల సమయంలో ఏర్పడిన విభేదాలు కశ్మీర్ రాజకీయ ప్రక్రియను బలహీన పరచకుండా చూడాలి.

★ కశ్మీర్‌లోని అన్ని రాజకీయ పక్షాలను సమస్య పరిష్కారంలో భాగస్వాములను చేయాలి. ఎన్నికలు బహిష్కరించినవారిని కూడా చర్చలకు ఆహ్వానించాలి.

★ గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో అనేక రకాల తీవ్రవాద శక్తులతో కేంద్రం చర్చలు జరిపింది. కొన్ని సందర్భాల్లో ఇవి ఫలించి, శాంతి, ప్రజాస్వామ్య పునరుద్ధరణకు దోహదం చేశాయి. కశ్మీర్ విషయంలోనూ ఇదే వర్తిస్తుంది.

★ కశ్మీర్ ఎన్నికల్లో భారీగా పాల్గొనడం ద్వారా ప్రజలు తీవ్రవాదుల బహిష్కరణ పిలుపును లెక్క చేయలేదనే సందేశాన్నిచ్చారు. అయితే దీన్నిబట్టి తీవ్రవాదం ఓడిపోయిందని, కశ్మీర్‌లో పరిస్థితులు తీవ్రవాదులకు ప్రతికూలంగా మారాయని భావించకూడదు.

★ గతంలో జరిగిన ఎన్నికల్లో కూడా ప్రజలు పెద్దఎత్తున ఓటుహక్కు వినియోగించుకున్నారు. కానీ తర్వాత పరిస్థితి మారిపోయింది. మిలటరీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పట్ల తమకున్న భావాలను వ్యక్తం చేసేందుకు



తమకంటూ ఒక ప్రతినిధి ఉండాలని భావించడం వల్లే కశ్మీర్ ప్రజలు భారీగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

★ ఎన్నికలు, భారీ ఓటింగ్‌ను సమస్య పరిష్కారానికి తొలి మెట్టుగానే భావించాలి. కశ్మీర్ ప్రజల్లో అనుమానాలను తొలగించే ప్రయత్నం చేయాలి. రాజ్యాంగం వారికి కల్పించిన ప్రత్యేక అధికారాలను గౌరవించాలి.

★ స్వయం ప్రతిపత్తి కోసం కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను భారత రాజ్యాంగానికి లోబడి సానుకూలంగా పరిశీలించాలి. భారతదేశ సార్వభౌమాధికారానికి ప్రమాదం లేనంత కాలం ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను గౌరవించడంలో తప్పు లేదు.

★ కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వాన్ని విశ్వాసంలోకి తీసుకుని కేంద్రం విస్తృత చర్చలను ప్రారంభించాలి. తీవ్రవాదం, సరిహద్దుల్లో శత్రు సైనికుల ఉన్మాద చర్యల పట్ల కఠినంగా వ్యవహరిస్తూనే కశ్మీర్ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే అన్ని వర్గాలతో సానుకూలంగా వ్యవహరించాలి. ఈ ద్విముఖ వ్యూహం ద్వారా కశ్మీర్ ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చు.